# మరదలా ! మరదలా ! మాణిక్యమా !!



రైలు వేగంగా పరుగెడుతూంది. కిటికీ పక్క సీటులో కూర్చున్నాడు భాస్కరం. అతని మనసు అస్థిమితంగా ఉంది. ఆందోళనగా ఉంది. కండక్టరుకు పదిరూపాయలు కానుకగా సమర్పించుకుంటే కాని ఈ సీటు దొరకలేదు. లేకపోతే ఎంతసేపని అలా నిలబడి ప్రయాణం చేయగలడు ? ఎక్కిన జనరల్ కంపార్ట్‌మెంటులో ఎంత రద్దీ ? జనం ఒకరి భుజాలు మీద ఒకళ్ళూ, ఒకరి మోకాళ్ళ మధ్య ఒకళ్ళూ ప్రాణం పోయినా సరే, ప్రయాణమే ముఖ్యమన్నట్టుగా కూరుకుపోయి ఉన్నారు... ఊంచని ప్రయాణం. ఆదరా బాదరా ఆఫీసర్ని బతిమలాడి ఒక్కరోజు సెలవు పెట్టి

ఉన్నపళంగా బయలు దేరవలసి వచ్చింది. ఇంట్లో భార్యకు కూడా వివరాలు ఏమీ చెప్పలేదు. ఊరికి వెళుతున్నాని ఒక్క మాట చెప్పి వీధిలోకి వచ్చేశాడు. "నాన్నగారూ ! నన్ను సర్కస్‌కు తీసుకెళ్ళరూ '' అని వెంటపడ్డ నానిగాడ్ని కసిరి కొట్టి లోపలికి పొమ్మ న్నాడు. రోడ్డు మీద కొచ్చి రిక్షా ఎక్కడం, రైల్వేస్టేషన్ చేరుకోవడం, అదృష్టవశాత్తు ఎక్కవలసిన రైలు ఎదురుగా ప్లాట్‌ఫారం మీద కనిపించటం... ప్రాణం లేచొచ్చినట్లయింది. కంగారు పడి టిక్కెట్టు తీసుకుని, తీరా అది ఎక్కడ బయలుదేరి పోతుందేమోనన్న బెంగతో నాలుగైదు అంగల్లో పట్టాల మీదుగా పరుగెట్టి ఆయాసంతో ఎలా గయితేనేం, రైలు అందుకో గలిగాడు.

"ఏమండీ ! మీ దగ్గిర అగ్గిపెట్టె ఉందా ?'' పిలుపు వినబడ్డవైపు భాస్కరం ఉలిక్కిపడి చూశాడు. పక్క సీట్లో కూర్చున్న పాతికేళ్ళ యువకుడు తన కళ్ళలోకి అభ్యర్ధనగా చూస్తున్నాడు. భాస్కరం నిర్లిప్తంగా జేబులోంచి అగ్గిపెట్టె తీసి ఆ యువకుడి చేతిలో పెట్టాడు. జేబులోంచి అగ్గిపెట్టెతో బాటు చెల్లెలు సునీత రాసిన ఉత్తరం కూడా బయటికొచ్చి కింద పడింది. భాస్కరం ఆత్రంగా ఆ ఉత్తరాన్ని అందుకున్నాడు. దాదాపు దాని వైపు భయం భయం గా చూశాడు. అప్పటికే అయిదారుసార్లు ఆ ఉత్తరం చదివినప్పటికీ, మనసులో ఆదుర్దా నణచి పెట్టు కుంటూ మరోసారి చదవడం మొదలుపెట్టాడు.

"ప్రియమైన అన్నయ్యకు,

నమస్కరించి వ్రాయునది, ఈ ఉత్తరం నీకు అందేటప్పటికి నా పరిస్థితి ఎలా ఉంటుందో నేనే వూహించుకోలేకపోతున్నాను. అతి పెద్ద ప్రయత్నం చేసి, ఒక కుర్రాడి ద్వారా రహస్యంగా ఈ ఉత్తరం పోస్టు చేస్తున్నాను. అత్తగారు, నా భర్త నన్ను బతకనిచ్చేటట్లు లేరు. నాలుగైదు నెలలుగా వాళ్ళు పెడుతూన్న నానా హింసలూ ఎలాగో భరించాను. చివరికిప్పుడు దిక్కులేని పక్షిలా చిక్కుకు పోయి, నా ప్రాణానికే ముప్పు కలుగుతుందేమోనన్న భయంతో నీకు తెలియపరుస్తున్నాను. అమ్మా, నాన్న మరీ కంగారు పడతారని వాళ్ళకు ఉత్తరం వ్రాయలేదు. వెంటనే వచ్చి రక్షిస్తావనే ఆశతో వేయి కళ్ళతో ఎదురు చూస్తూన్న... అభాగ్యురాలు, నీ చెల్లెలు, సునీత.

భాస్కరం ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నా డు. చెల్లెలు రూపం దీనంగా కళ్ళలో కనిపించేసరికి అతనికి ఒళ్ళంతా నీరు కారిపోయినట్లయింది.

సునీతది అసలే సున్నితమయిన మనసు. దాన్ని వాళ్ళు ఎన్ని బాధలు పెడుతున్నారో ఏమిటో? అయినా సునీతని భర్త ఎంతో అపురూపంగా చూసుకోవాల్సింది పోయి, అంతగా బాధపెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది ? పెళ్ళయి సంవత్సరం దాటిందేమో ! బ్యాంకులో ఉద్యోగం అతనికి. చాలా సంస్కారవంతుడిలానే కనిపించాడు. అత్తగారు కూడా చాలా అమాయకురాలిగానే తోచింది. మరి ఎందుకిలా జరిగింది ? పెళ్ళిలో లాంచనాలు ఏవీ తక్కువ చెయ్యలేదు. కట్నంకూడా వాళ్ళు కోరినట్టే ఇవ్వడం జరిగింది. అయితే అలకపాన్పు మీద స్కూటరు అడిగితే అమ్మా, నాన్నా సరేనని, దాన్ని కొని ఇవ్వడంలో కొంత ఆలస్యం చేశారు. తరవాత ఏదో పండగ సందర్భంలో ఇంటికి వెళ్ళినప్పుడు ఒకసారి సునీత "ఒరే, అన్నయ్యా ! మీ బావగారికి ఇల్లు ఏదో తక్కువ ధరకి అమ్మకానికొచ్చిందట. నువ్వేమన్నా డబ్బు సర్దగలవా'' అంటూ అడిగింది. భలే దానివే నువ్వు! అడక్కడక్క నన్నే అడిగావూ ! అంటూ నవ్వేసి

వూరుకున్నాడు తను. ఆ తరువాత సునీత ఇంట్లో అమ్మ, నాన్నను కూడా అడిగినట్లు విన్నా తను పట్టించుకోలేదు. బహుశా ఆ డబ్బు గురించే వాళ్ళు సునీతని హింసిస్తున్నారేమో ! లేకపోతే బావగారు ఏదైనా గ్రంథం నడుపుతూ ఎక్కువ కట్నం వస్తుందని వేరే... పెళ్ళికి ఆయత్త మవుతున్నారా !

భాస్కరం ఆలోచించే కొద్దీ ఊహలు మరీ భయంకర రూపం దాలుస్తున్నాయి. ఏదో స్టేషన్లో రైలాగింది. కాఫీ టీకుర్రాళ్ళ కేకలతో గోలగా ఉంది. ఒక కుర్రాణ్ణి పిలిచి రూపాయిచ్చి కాఫీ పుచ్చుకున్నాడు భాస్కరం. అది తాగబోయి అచ్చం, ఆముదంలా అనిపించి, ఛీ ! ఛీ ! అని తిట్టుకుంటూ బయట పారబోసి గ్లాసు తిరిగి ఇచ్చేశాడు. సిగరెట్ వెలిగించి తృప్తిగా రెండు దమ్ములు పీల్చి కళ్ళు మూసుకున్నాడు. రైలు బయలుదేరింది. ఎంత సరిపెట్టుకుందామన్నా అతనికి చెల్లెలు గురించిన ఆలోచనలతో మనసు అతలా కుతలమయి పోతూంది. ఏమో! తెల్లవారి లేస్తే ఎన్ని దారుణాలు కళ్ళ బడటం లేదూ ! రోజూ పత్రికల్లో ఎన్ని అఘాయిత్యాలు చదవటం లేదూ ! ఆడకూతుళ్ళ హత్యలు, ఆత్మహత్యలు, సజీవ దహనాలు ఒక వేళ తను వెళ్ళేటప్పటికే సునీత కేమైనా జరగకూడనిది జరిగితే ! నో ! అలా జరగకూడదు. జరగడానికి వీల్లేదు. భాస్కరం భయవిహ్వలంగా తల పట్టుకున్నాడు.

ఎటువంటి పరిస్థితిలోనయినా సునీతని వెంటబెట్టుకుని వచ్చేయాలి. అక్కడ ఒక్క క్షణం కూడా ఉంచకూడదు. కాదంటే వాళ్ళకు తగిన విధంగా బుద్ధి చెప్పాలి. భాస్కరం ఆలోచనలలో కొట్టుమిట్టాడుతూండడానే దిగవలసిన స్టేషనొచ్చే సింది. గబగబా చేతి బ్యాగు తీసుకుని స్టేషను బయటకొచ్చాడు.

"ఏయ్, రిక్షా సీతంపేట వస్తావా ?"

'ఆఁ వస్తానయ్యా ! ఐదు రూపాయల వుద్దండి'

"ఐదు రూపాయలా ! సరే, రా ! త్వరగా పోనీయ్ !" మరొకప్పుడైతే గీచి గీచి బేరమాడి వాడేమోగాని, అవసరాన్ని తలుచుకుంటూ హడావిడిగా రిక్షా ఎక్కి కూర్చున్నాడు భాస్కరం. రిక్షా జనాన్ని తప్పించుకుని ముందుకు పరుగుపెట్టింది. సమయం మధ్యాహ్నం ఒంటిగంట కావస్తూంది. ఎండ ఫెళ్ళున కాస్తూంది. జనం పలచబడి రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. రిక్షా సీతంపేటలోకి ప్రవేశించి, రెండు మలుపులు తిరిగి సునీతా వాళ్ళ వీధిలోకి రాగానే గుండెనిండా భయం పేరుకోసాగింది కంగారుపడుతూ వీధి చివరివరకూ దృష్టిని సారించాడు. సునీత వాళ్ళ ఇంటిముందు హడావిడి ఏమీ లేదు. జనం ఎవ్వరూ ఉన్నట్టుగా కనిపించలేదు. ఏమీ జరగనందుకు భాస్కరం తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

ఇంటిముందు రిక్షా ఆపమని వాడికి డబ్బులిచ్చి, ఆంతర్యంలోని అలజడి నణుచు కుంటూ గేటు తీసుకుని లోపలికి నడిచాడు. తలుపులు, కిటికీలు అన్నీ మూసి ఉన్నాయి. ఏం చేస్తున్నారో లోపల ? సునీతని గదిలో నిర్బంధించి బాధపెడుతున్నారా ? భాస్కరం కాలింగ్ బెల్ నొక్కాడు. కొద్ది క్షణాల్లోనే ఎవరో వస్తూన్నట్లని పించింది. తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా చెల్లెలు సునీత ! థాంక్ గాడ్ ! తన చెల్లెలు క్షేమంగానే ఉంది. అదేమిటి ? ముఖం కొద్దిగా వాచినట్టుగా ఉంది ! బాగా ఏడ్చిందా ? మనిషి కూడా చిక్కినట్టుగా కనిపిస్తూంది.

"అన్నయ్యా ! ఏమిటి హఠాత్తుగా ఊడిపడ్డావు?

రా! రా! అక్కడే నిలబడిపోయావేం ?'' సునీత పిలుపుతో భాస్కరం తెప్పరిల్లి లోపలికి అడుగు పెట్టాడు. "మంచినీళ్ళు తెస్తానుండు.'' సునీత లోపలికి వెళ్ళింది. "సునీత ఇలా మాట్లాడు తుందేమిటి ? ఇంకా భయపడతూందా !'' భాస్కరం ఆ గదిని పరిశీలనగా చూస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

"బాబూ ! ఇదేనా రావడం ! ఎప్పుడు బయలుదేరావు ?'' సునీత అత్తగారు లోపల్నుంచి వస్తూ కుశల ప్రశ్నలు వేసింది.

ఆహా ! ఏమి ఆప్యాయత ? ఎంత నటన కనబరుస్తోందీవిడ...? సునీత ఇందుకేనా భయ పడింది ! ఎక్కడ మేమిద్దరం కలిసి మాట్లాడుకుంటా మోనని సునీతను నీడలా వెంటాడుతూ వచ్చేసింది.

"ఇదే రావడం, అత్తయ్యగారూ ! కులాసాగా ఉన్నారా ?'' భాస్కరానికి ఈ వాతావరణం నమ్మబుద్ధికావటం లేదు. మనసులో అనుమానం పెనుభూతంలాగే ఉంది. జేబులో ఉత్తరాన్ని తీసి మరోసారి జాగ్రత్తగా పరిశీలించాడు. సందేహం లేదు. అది సునీత వాళ్ళ ఊరునించి పోస్టు చేయబడిందే !''

"నా కులాసాకేంలే, బాబూ ! రోజులు లెక్కబెట్టుకుంటూన్నదాన్నిరా! కాళ్ళు కడుక్కో ! భోజనం చేద్దువుగాని''

ఎంత నంగనాచి కబుర్లు చెబుతూందీవిడ ! ఒకవైపు కోడల్ని నంజుకుతింటూ, మరొకవైపు వైరాగ్యం వల్లిస్తూంది.

"మంచినీళ్ళు పుచ్చుకో, అన్నయ్యా ! అన్నం కూడా వడ్డించేస్తాను.''

వచ్చినట్లే వచ్చి సునీత లోపలికి వెళ్ళి పోయింది.

"భోజనం ట్రైనులో చేశానత్తయ్యగారూ, ఏమీ అనుకోవద్దు. మీరనుమతిస్తే సునీతని ఒకసారి మా ఇంటికి తీసుకువెళ్దామని వచ్చాను.'' భాస్కరానికి కడుపులో ఆకలి కరకరమంటూన్నా, వచ్చిన పనిని సానుకూలపరుచుకోవడంలో చాలా పట్టుదలగా ఉన్నాడు.

"అదేమిటి, బాబూ ! మా ఇంటికి వస్తూ ట్రైనులో భోజనం చెయ్యడమేమిటి ? చాలా విడ్డూరంగా మాట్లాడుతున్నావే ! సరే, నీ ఇష్టం. బలవంతం చేస్తే మాత్రం తింటావా ఏమిటి ? సునీత ఇప్పుడు మీ ఇంటికెందుకయ్యా ? వచ్చేవారం నుంచి కార్తీకమాసం నోములు కూడాను. ఎలా పంపిస్తాం అనుకున్నావు ?'' సునీత అత్తగారు దవడలు సాగదీసుకుంటూ చాపమీద చతికిల బడింది.

"అలాక్కాదండి ! మీరు తప్పక పంపించాలి. నోములకి మళ్ళీ తీసుకొచ్చి అప్పగించేస్తాను. ముఖ్యంగా వాళ్ళ వదిన సునీతని చూడాలని చాలా బెంగపెట్టుకుంది.'' భాస్కరం ఏదో అణచి పెట్టుకుంటున్నట్టుగా ఎరువు గొంతుకతో అన్నాడు.

"అయ్యోరామా ! మీ ఆవిడ చూడాలను కుంటోందా ? ఇంకా ఏమిటో అనుకున్నాను. ఆవిడ్నే తీసుకు రాలేకపోయావా ! చూసి వెళ్ళిపోను.''

"అది కాదండీ, సునీత తనకు ఒంట్లో బాగుండలేదని ఆ మధ్య ఉత్తరం వ్రాసింది. అందుకని...''

"సునీతకు ఒంట్లో బాగుండక పోవడమేమిటి? నిక్షేపంలా మసలుతూంటేనూ ! ఏమేవ్, సునీతా, ఒకసారి ఇలా రా !'' అత్తగారి కేకతో సునీత వంట గదిలోంచి చెమటలు కక్కుకుంటూ వచ్చింది.

"ఏమే, నువ్వు మీ అన్నయ్య వదినలకి ఒంట్లో బాగులేదని ఉత్తరం రాశావా ?''

"లే... లే దత్తయ్యా ! ఆఁ ఆమధ్య రాశానేమో గుర్తులేదు."

"ఛీ ! ఛీ ! ఈ సునీత ఏమిటి ? ఒట్టి మట్టి బుర్ర కాకపోతేనూ ! నోరు విప్పి సమాధానమే చెప్పలేక పోతూంది. ఎంత భయమైతే మాత్రం అలా బొమ్మలా నిలబడి పోవడమే ! వేరే దిక్కులేదని, తననొచ్చి రక్షించమని ఉత్తరం రాసింది. ఛీ! ఛీ! తన తెలివికూడా తెల్లారినట్టే ఏడ్చింది. అసలు మొట్టమొదటే తన తల్లికో, తండ్రికో, మరెవరికో ఒకిరికి ప్రాణం మీది కొచ్చిందని అబద్ధం చెప్పవలసింది. అప్పుడు నోరెత్తకుండా చచ్చినట్టు చెల్లెల్ని తనతో పంపించి ఉండేది ! ప్చ్ ! కంగారుపడి మనసులో ఉక్కిరి బిక్కిరవుతూ ఒకటి చెప్పబోయి మరొకటి చెప్పేశాడు.

"చూడు భాస్కరం ! అమ్మాయిని పంపించటం ఎటువంటి పరిస్థితిలోనూ ఇప్పుడు కుదరదు. కావాలంటే మీ బావని అడుగు. బ్యాంకులో ఉన్నాడు. భోజనం చేయాలనుకుంటే కాస్త చేసి వెళ్ళు." అత్తగారు ఖచ్చితంగా చెప్పేసింది.

"అంతేనంటారా !" భాస్కరం నీళ్ళుగారి పోతూ అన్నాడు.

"అంతే మరి !"

"అన్నయ్యా ! అన్నం వడ్డించేస్తాను రా." సునీత లోపలికి వెళుతూ పిలిచింది. "ఛీ! ఈ సునీత కసలు బుద్ధిలేదు. ఎంతకూ తన ఆవేదన అర్థం చేసుకోదే ! ఎంతో ప్రయాసపడి వచ్చినందుకు ఒక్క క్షణం వీలు చేసుకుని అసలేం జరుగుతూందీ చెప్పొచ్చుగా !"

"వద్దమ్మా ! అలా బావగారి దగ్గరికెళ్ళి మళ్ళీ వస్తాను." భాస్కరం గుమ్మం బయటికొచ్చి చెప్పులేసుకుని వీథిలో పడ్డాడు. కడుపులో పేగులు రొద చేస్తున్నాయి. వీథి చివరి టీ స్టాల్ దగ్గిర ఆగి ఒక బన్ రొట్టె తిని టీ తాగాడు. నెమ్మదిగా నడిచి బ్యాంకు చేరుకున్నాడు.

బావ కరుణాకరం కౌంటరులో చాలా బిజీగా పని చేసుకుంటున్నాడు. భాస్కరాన్ని చూసి 'హలో బావగారూ' అంటూ పలకరించి ఎదురుగా సోఫాలో కూర్చోమని సైగచేసి తన పనిలో మునిగిపోయాడు. పది నిమిషాల అనంతరం బయటికొచ్చి చేయి పట్టుకుని కేంటీనుకు తీసుకెళ్ళి కుశల ప్రశ్నలు వేశాడు.

"కారణం అంటూ ఏమీ లేదు. ఒకసారి చెల్లాయిని మా ఇంటికి తీసుకెళ్దామని..." భాస్కరం అసలు విషయం బయటపెట్టాడు.

"అమ్మబాబోయ్ ! ఇంకేమన్నా ఉందా ! మీ చెల్లెలు ఒక్క పూట ఇక్కడ లేకపోయినా నేను పస్తు పడుకోవాల్సిందే ! మా అమ్మగారికి నడుం నొప్పి. కూర్చుంటే లేవలేదు. పొద్దుట లేచింది మొదలు కుయ్యోమొయ్యోఅంటూ మూలగడమే ఆవిడ పని. ఈ పరిస్థితుల్లో మీ చెల్లెల్ని పంపించటం ! సారీ, వెరీ సారీ !" కరుణాకరం తన తల్లికంటే మరింత ఖచ్చితంగా చెప్పేశాడు.

"అది కాదు, బావగారూ ! నేను చెప్పేది..."

"మీరింకేమీ చెప్పొద్దు. అవతల నాకు బోలెడు పని ఉంది. ఈ రోజు ఉండండి. సాయంకాలం మాట్లాడుకుందాం !" కరుణాకరం హడావిడిగా వెనక్కి తిరిగాడు.

"ఈ రోజు ఉండటానికి నాకు సెలవు లేదండి! నేను వెళ్ళాలి. మీరు చెల్లాయిని..." భాస్కరం మతిలేని మనిషిలా నాలుగడుగులు ముందుకు వేశాడు.

"నన్నేమీ బలవంతం చెయ్యొద్దు ! కావాలంటే పండక్కి పదిరోజుల ముందు తీసుకెళుదురు కాని మీ చెల్లాయిని." కరుణాకరం చరచరా అడుగులు వేస్తూ బ్యాంకు లోపలికి వెళ్ళిపోయాడు.

"ఊహూఁ. లాభం లేదు ! ఈ తల్లీ కొడుకులిద్దరూ ఏదో కుట్ర చేస్తున్నట్టే ఉంది. చెల్లాయిని పంపించటానికి వీళ్ళింత గొప్పగా నటిస్తున్నారంటే ఏదో గూడుపుఠాణి జరుగుతూందన్న మాట ! వీళ్ళిద్దరూ మెత్తగా కుత్తుకలు కత్తిరించే రకం. అంత త్వరగా బయట పడరు. మనమూ బయట పడకూడదు. ముందు సునీతని

ఆ ఇంటి నుంచి తప్పించడానికి మరో మార్గం ఆలోచించాలి. భాస్కరం నిరాశగా వెనక్కి తిరిగి మళ్ళీ సునీత వాళ్ళ వీధిలోకి వచ్చాడు. సునీత వాళ్ళ ఇంటి పక్క పెంకుటింటి అరుగుమీద రిటైరయిన స్కూలు మాస్టారేమో పదిమంది పిల్లల్ని ముందేసుకుని కునుకుపాట్లు పడుతున్నాడు. పరిచయమున్న వ్యక్తిలా భాస్కరం ఆ ఇంటి అరుగు మీదకు వెళ్ళి, తనను తాను పరిచయం చేసుకున్నాడు. దగ్గరగా జరిగి, తాను అడగబోయే విషయం మనసులోనే పెట్టుకోమని ముందుగా వేడుకున్నాడు. "సునీతా వాళ్ళింట్లోంచి ఈ మధ్య ఏవైనా గొడవలు, కేకలులాంటివి మీ చెవిన పడ్డాయా" అంటూ గొంతు తగ్గించి అడిగాడు.

"పెద్దగా ఏమీ లేవనుకోండి. కాని, అప్పుడప్పుడు ఆ పెద్దావిడ గొంతు మాత్రం పెద్దగా వినపడుతూంటుంది. ఆ కుర్రాడు కూడా మంచివాడులాగే కనిపిస్తూంటాడు, నాయనా ! కాని ఇంతకు ముందు మీ చెల్లాయిని స్కూటరు మీద ఎక్కించుకుని ఎక్కువసార్లు బయటకు తీసుకెళ్ళేవాడు. ఈ మధ్య అంతగా కనిపించడం లేదు. అంతే !" భాస్కరం ఆయన దగ్గర సెలవు తీసుకుని, అరుగు మీద నుంచి వీధిలో కొచ్చి సునీత ఇంటిముందు ఆగాడు. ఇంట్లోంచి ఏవో మాటలు బయటకు వినబడుతున్నాయి. భాస్కరం చప్పుడు చేయకుండా అడుగులో అడుగు వేసుకుంటూ గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

'ముదనష్టపుదానా ! నువ్వెక్కడ దాపురించావే! ఒక పని చేత కాదు. నోరెత్తి మాట్లాడలేవు. ఎందుకు నువ్వు ? లాభం లేదు. మరొకదాన్ని చూసుకోవడమే!' సందేహం లేదు. అది సునీత అత్తగారి గొంతే ! నేను బయటికెళ్ళానని. ఆవిడ కోడల్ని సాధించడం మొదలు పెట్టిందన్న మాట ! భాస్కరం ఆవేశంగా కాలింగ్ బజర్ నొక్కాడు. కొంత సేపటికి అత్తగారు వచ్చి తలుపులు తీసింది.

"రా ! బాబూ ! నా ప్రాణం విసిగించేస్తూం దనుకో. ఈ వెధవ పనిపిల్ల ! నోరులేని మూగపిల్లని జాలి పడి పనిలో పెట్టుకుంటే ఒక్క రోజు కూడా టైముకు వచ్చి చావదనుకో !"

భాస్కరం లోపలికి తొంగి చూశాడు. కుళాయి దగ్గర పని పిల్ల బుర్ర వంచుకుని పనిచేస్తూంది. కొంత మనసు తేలిక అయింది... ఆ పనిపిల్ల స్థానంలో తన చెల్లెలు లేనందుకు...

"అత్తయ్యగారూ ! నేను వెళ్ళొస్తాను. బావగారు కూడా చెల్లాయి నిప్పుడు పంపించటం కుదరదన్నారు. నాకా సెలవు లేదు. వెంటనే వెళ్ళిపోవాలి. ఒకసారి సునీతని పిలుస్తారా !" భాస్కరం వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ అన్నాడు.

"అయ్యో, బాబూ ! సునీత ఇంట్లోకి రాకూడదు. బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూంది. కాస్సేపు ఉంటావా ?"

"వద్దు లెండి ! నేను వెళతాను. మళ్ళీ నాలుగైదు రోజుల్లో ఎవరో ఒకరు చూడటానికి వస్తారని చెల్లాయితో చెప్పండి."

"అలాగే, బాబూ ! భోజనం చెయ్యమంటే చెయ్యలేదు మరీ !"ఆమె సణుక్కుంటూ తలుపులు దగ్గరగా వేసుకుంది. భాస్కరం బయటికొచ్చేశాడు. అతని బుర్ర అంతా గందరగోళంగా ఉంది. ఏమీ తోచడం లేదు. సునీతతో మాట్లాడడం కుదరలేదు. తనకు తానుగా అవకాశం కల్పించుకుని సునీత మాట్లాడలేదు. దాని ముఖంలో ఆ భావాలేవి కనిపించలేదు. మరి ? సునీత బాత్‌రూమ్‌లో ఉందన్న మాట ఎంతవరకూ నిజం ? ఉహూం నాలుగైదు రోజుల్లో సెలవు పెట్టి మళ్ళీ రావాలి ! అమ్మా నాన్నలకీ విషయం సూచాయగా తెలియ పరచాలి. వాళ్ళకుతగిన శాస్తి చెయ్యాలి.

భాస్కరం ఆ వీధిలో నడుస్తున్నాడు. ఎదురుగా సైకిలు మీద వస్తూన్న కానిస్టేబులు ముఖం ఎక్కడో చూసినట్లయింది. అంతలో అతనే భాస్కరానికి విష్ చేసి సైకిలు దిగాడు. ఆ కానిస్టేబులు తను హైస్కూల్లో చదివినప్పటి క్లాస్‌మేటు. అప్పట్లో ఇద్దరి మధ్యా మంచి స్నేహం ఉండేది. భాస్కరం అతనితో కొంతసేపు పిచ్చాపాటి

మాట్లాడి, ఎందుకైనా మంచిదని వచ్చిన విషయం చెవిలో వేశాడు.

"అలాగేరా, భాస్కరం. నువ్వేం భయపడకు. ఈ వారం నైట్ డ్యూటీ నాదే ! ఈ ఏరియా అంతా నేనే బీటు తిరుగుతాను. జాగ్రత్తగా కనిపెట్టి, నీ చెల్లెల్ని వాళ్ళు ఏమాత్రం బాధపెడుతున్నట్టు తెలిసినా నీకు వెంటనే వైరు ఇస్తాను. సరేనా ! నువ్వేం వర్రీ అవకు !" కానిస్టేబుల్ మిత్రుడు భరోసా ఇచ్చి ముందుకు వెళ్ళిపోయాడు. భాస్కరానికిప్పుడెంతో తృప్తిగా ఉంది. గుండె నిండా గాలి పీల్చుకున్నట్లయింది. వెంటనే రిక్షా ఎక్కి రైల్వే స్టేషను చేరుకున్నాడు. రైలు గంట లేటు. ఆ గంటసేపు ప్లాట్ ఫారమ్ మీద అటూ ఇటూ తిరిగి కాలక్షేపం చేశాడు. ట్రైను రాగానే ఎక్కి నిలబడ్డాడు. ఎక్కడా చోటు లేదు. ప్రయాణం అంతా చెల్లెలు సునీత ఆలోచనలతోనే గడిచిపోయింది. ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదిగంటలు భార్య వంట గదిలో ఇంకా ఏవో సర్దుకుంటూంది. పిల్లలంతా పడుకున్నారు. మరదలు రత్న మాత్రం చాపమీద పడుకుని ఏదో పత్రిక తిరగేస్తూంది.

"బావగారూ ! ఏమిటలా అలసిపోయారు ? ముఖం పీక్కుపోయింది. మనిషి నీరసపడిపోయారు! పొద్దుటే అంత హడావుడిగా ఎక్కడికెళ్ళారసలు ?' ' మరదలు రత్న చాప మీద నుంచి లేచి ఆత్రంగా అడుగుతూన్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే భాస్కరం లోపలికి వెళ్ళిపోయాడు. కాళ్ళూ, చేతులు ముఖం కడుక్కొని, భార్య కంచంలో పెట్టిన అన్నం కొంచెం కతికి మంచం మీద వాలిపోయాడు. కొంత సేపటికి భార్య సావిత్రి, 'ఏవండీ ! నిద్రపోయారా!' అంటూ మంచం దగ్గరగా వచ్చింది. భాస్కరం చికాగ్గా అటునుంచి ఇటు తిరిగాడు.

"రత్న రేపు ఉదయమే వెళ్ళిపోతానంటోందండీ !"

"రెండ్రోజులు ఉండమను !" భాస్కరం అన్యమనస్కంగానే అన్నాడు.

"ఏదో నాలుగు రోజులు కాలేజీ సెలవులు కలిసొచ్చాయని సరదాగా వచ్చింది. మీరు సరిగ్గా మాట్లాడడం లేదని ఒకటే చిన్నబుచ్చుకుంటూంది. సెలవులైపోయాయట, వెళతానంటూంది.

"సరే, వెళ్ళమను ! భాస్కరం నిద్ర పోవడానికి ఉపక్రమిస్తూ భార్య చేయి పట్టుకుని పక్కలో కూర్చోపెట్టుకున్నాడు.

ఉదయం భాస్కరం నిద్ర లేచేటప్పటికి బాగా పొద్దెక్కింది. ఇంటి ముందు రిక్షా ఆగి ఉంది. మరదలు రత్న తన సూట్‌కేస్ రిక్షాలో పెడుతూ కనిపించింది. భార్య సావిత్రి దగ్గరుండి చెల్లెల్ని సాగనంపుతూంది. భాస్కరం బెడ్‌రూమ్‌లోంచి గబగబా బయటకొచ్చాడు. చొక్కా జేబులోంచి ఏభై రూపాయలు తీసి, రిక్షా దగ్గరికొచ్చి మరదలి చేతిలో పెట్టాడు. "మరదలు పిల్లా ! చిక్కిపోతున్నావు. మరీ అంతగా చదివేయకు, అంటూ హాస్యమాడి లోపలికి వెళ్ళిపోయాడు. మరదలు రత్న ముసిముసిగా నవ్వింది. రిక్షా ముందుకు కదిలింది.

మూడు రోజుల అనంతరం మళ్ళీ భాస్కరం తన చెల్లెలు ఇంటికి వెళ్ళే సన్నాహంలో ఉండగా పోస్ట్‌మన్ ఒక లెటరు చేతికిచ్చి వేగంగా వెళ్ళిపోయాడు.

"ప్రియమైన బావగారికి...

నమస్కరించి వ్రాయునది. ఒక విధంగా మీ మనసు కష్టపెట్టానేమో ననిపిస్తూంది. అయినా నేను చేసిన చిన్న ప్రయత్నం మీలో మంచి మార్పు తీసుకొచ్చినందుకు సంతోషంగానూ ఉంది. మీ చెల్లెలు సునీత ఆపదలో ఉందని, ఆమె అత్తగారు, భర్త కలిసి నానా హింసలు పెడుతున్నారని ఉత్తరం రాసింది నేనే ! ఎందుకో మీరు ఆలోచిస్తే కొంత అర్థం కాకపోదు. వారం రోజుల క్రితం నేను మీ ఇంటికి వచ్చినప్పుడు అక్క తన జీవితం ఎలా గడుస్తూందో ఏడుస్తూ చెప్పింది. ఎప్పుడో మీ పెళ్ళిలో మా నాన్న కట్నం తాలూకు సొమ్ము మూడువేలు ఇబ్బందుల వల్ల ఇవ్వలేక పోయాడని మా కందరికీ తెలుసు. తరవాత ఆయన లారీ ఏక్సిడెంట్‌లో అమ్మని నన్ను తమ్ముణ్ణి దిక్కులేని

వాళ్ళని చేయడం, అన్నయ్యలు ఎవరికి వాళ్ళు వాళ్ళ పెళ్ళాలతో ఎగిరిపోవడం మీకు తెలియంది కాదు. ఇటువంటి పరిస్థితుల్లో అక్క మీకు ఆ సొమ్ము ఎక్కడ్నుంచి తీసుకొచ్చి ఇస్తుంది ? ఆ కట్నం సొమ్ము తీసుకురమ్మని ఆమెను మీరు రాత్రింబవళ్ళు మానసికంగా, శారీరకంగా హింసించడం అర్థం ఏమిటి ? నాలుగైదు సార్లు అక్కని మీరు పుట్టింటికి పంపినా మా ఇబ్బందుల్ని చూసి అక్క నోరు విప్పలేదు. మామూలుగా తిరిగి వెళ్ళిపోయింది. ఆ రోజు బాత్‌రూమ్‌లో అక్క వీపు మీద మీరు కొట్టగా కరడు కట్టిన తట్లు చూసి నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఎంతో సంస్కారవంతుడిలా కనిపించే మీ రూపం నాలో ఎనలేని అసహ్యాన్ని నింపింది. అందుకే ఒక పథకం ద్వారా మీ చెల్లెలు రాసినట్టు ఉత్తరం రాసి అదే ఊళ్ళోని నా స్నేహితురాలి ద్వారా పోస్టు చేయించాను. మీ చెల్లెలు కష్టాల్లో ఉందని తెలియగానే మీరు ఎంత కంగారుపడిపోయారు ! ఇంట్లో మాకెవ్వరికీ తెలియకుండా ఆదరా బాదరా సెలవు పెట్టి ఆ వూరు వెళ్ళిపోయారు. వెళుతూ మీరెంత మథన పడ్డారో వెళ్ళిన తరవాత విషయం అంతపట్టక మరెంతగా నలిగిపోయారో నేను ఊహించుకోగలను. ఆ రోజు రాత్రి నీరసంగా మీరు ఇంటికి వచ్చినప్పుడే అంతా గ్రహించాను. ఏం ? మీ చెల్లెలు లాంటిది కాదా నా అక్క ? మీ చెల్లెలకు ఒక న్యాయమూ, నా అక్క మీ భార్య అయినందుకు ఒక న్యాయమూనా ? తప్పుకదూ ! ఆమె ఎవ్వరితో చెప్పుకోగలదు ? కన్నవాళ్ళని వదలి, కట్టుకున్న వాడే సర్వం అనుకుని మీతో బతుకుతూన్న ఆడది. ఆ కట్టుకున్న వాడే నరకయాతన పెడుతూన్నప్పుడు ఆమె ఎవరితో చెప్పుకోగలదు? కన్నవాళ్ళు ఎక్కడో దూరంగా ఉండి ఆమె క్షేమాన్ని, ఆనందాన్ని కోరుకోవటం తప్ప ఆమెనెలా ఆదుకోగలరు ? మీకు సేవలు చేసి, పిల్లల్ని కని, వాళ్ళను సాకుతూ, మీకు తోడుగా నిలబడాలనుకునే ఆడదాన్ని డబ్బుకోసం ఇంకా పీడించాలనుకోవడం మీ మగవాళ్ళ మగతనానికే దౌర్భాగ్యం కదూ !

నా కిప్పుడెంతో ఆనందంగా ఉంది. ఆ రోజు రాత్రి అక్కతో మీరు ఎంతో ప్రేమగా మాట్లాడారట. "ఇక ముందెన్నడూ నిన్ను బాధ పెట్టనూ కట్నం తాలూకు సొమ్ము నాకేం అక్కర్లేదు, అంటూ చేతిలో చేయి వేసి వాగ్దానం చేశారట. అక్క నాతో చెప్పి ఎంత ఆనందించిందో మీకెలా వర్ణించను ? ఉంటాను, బావగారూ ! అబద్ధపు ఉత్తరం రాసి అనవసరంగా మిమ్మల్ని ఆవేదనకు గురి చేసిన ఈ మరదలి చిన్ని సాహసాన్ని మన్నిస్తారు కదూ ! మీరు మనిషిగా మానవతా మూర్తిగా మరో అవతారం ఎత్తినందుకు మరోసారి ధన్యవాదాలర్పిస్తూ... మీ మరదలు రత్నమాణిక్యం.

ఉత్తరం చదవటం పూర్తి చేసిన భాస్కరంలో ఆశ్చర్యం, ఆనందం, అంతకు మించిన మధురమైన అనుభూతి...

"ఎంతపని చేశావు. మరదలు పిల్లా !" ప్రయాణం రద్దు చేసుకుని సావిత్రి అంటూ వంట గదిలోకి నడుస్తూ "మరదలు పిల్లా నువ్వు నిజంగా మాణిక్యమే ! మాణిక్యమే ! అనుకోకుండా ఉండలేకపోయాడు ! భాస్కరం.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
3-11-1983